
లింగంపేట మండలం ఒంటరిపల్లిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఎండిపోయిన వరి పంట

# ఎత్తిపోయిన బోర్లు ఎండిన పంటలు

- యాసంగిలో వెంటాడుతున్న సాగునీటి కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిన పొలాలు పశువుల పాలు
- ఆగమాగమవుతున్న రైతులు

లింగంపేట/ మాచారెడ్డి, మార్చి 13: పచ్చని పంట పొలాలతో కళకళలాడాల్సిన పల్లెలు.. నేడు వెలవెలబోతున్నాయి. భూగర్భ జలాలు అడగుంటిపోతుండడంతో పంట యాసంగి పంటలకు సాగునీరు అందడం లేదు. భూమిని నమ్ముకొని కోటి ఆశలతో అప్పులు చేసి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. సాగునీరందక పంటలు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.'వానకాలం'తో సమానంగా యాసంగిలోనూ పంటలు సాగుచేస్తున్నారు. కొన్నిరోజులుగా ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతూ రైతు నుంచి కంటనీరు తెప్పిస్తున్నాయి. కొందరు రైతులు ఎండిన పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

లింగంపేట మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వరి పంట ఎండిపోతున్నది. ఒంటర్‌పల్లి గ్రామంలోని రమావత్ చాందీరాం అనే రైతుకు చెందిన ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఐదెకరాల్లో వరి పంట సాగుచేయగా.. వేసిన రెండు బోర్లు వట్టిపోయాయి.పొట్టదశలో ఉన్న పంట కండ్ల ముందే ఎండిపోవడంతో రైతు తీవ్ర మనోవేదనకు గురువుతున్నాడు. చేతికి అంది వచ్చిన పంటను కాపాడుకోవడానికి రెండు బోర్లు వేసినా నీటి జాడ కనిపించకపోవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పరిసరాల్లోని బోరు బావుల్లో సైతం నీరు తగ్గిపోవడంతో వారు సాగునీరు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు చాందీరాం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట పెట్టుబడి చేతికి వస్తుందన్న ఆశలు అడియాశలు అవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.



## రెండు బోర్లు వేసినా.. కానరాని నీటి జాడ

పక్క చిత్రంలోని రైతు పేరు పెనుగొండ వినోద్. స్వగ్రామం మాచారెడ్డి మండలం ఎల్లంపేట. గ్రామంలో ఆయనకు ఉన్న ఆరు ఎకరాల్లో వరి వేశాడు. అప్పటికే ఉన్న బోరు వట్టిపోవడంతో ఎలాగైనా పంటను కాపాడుకోవడానికి రూ. లక్ష ఖర్చు చేసి రెండు బోర్లు వేయించాడు. కానీ చుక్క నీరూ రాలేదు. దీంతో సాగునీరందక పంట పూర్తిగా ఎండిపోయింది. ఇక చేసేదేమీలేక ఎండిన పొలంలోకి మేత కోసం పశువులను వదిలాడు. ఇలాంటి పరిస్థితి వినోద్ అనే ఒక్క రైతుదే కాదు. మండలంలోని చాలా మంది రైతులు ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నారు. సర్కారు స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


మాచారెడ్డి మండలం ఎల్లంపేటలో ఎండిపోయిన వరి పంటలో మేస్తున్న మేకలు



## కౌలు డబ్బులు ఎలా చెల్లించాలో తెలియడం లేదు

గ్రామానికి చెందిన రైతు వద్ద ఐదెకరాల పొలం కౌలుకు తీసుకున్న. యాసంగిలో వరి పంట సాగు చేస్తున్న. ఐదు ఎకరాల్లో ఉన్న రెండు బోర్లలో నీళ్లు ఎండిపోయినయ్. గింజ పాలు తాగుతున్నది. ఇప్పుడు నీరు మంచిగా ఉంటే గింజ గట్టి పడుతుంది. గింజ గట్టి పడే టైంలా నీళ్లు లేకుండా పోయినయ్. పక్కన పొలం వాళ్లను నీళ్లడిగితే ఇయ్యమన్నరు. రెండు వందల ఫీట్లు ఒకటి, మూడు వందల ఫీట్లు ఒకటి రెండు బోర్లు వేసినా చుక్కనీరూ రాలేదు. పంట పెట్టుబడికి రూ. 80వేల దాకా పెట్టిన. పెట్టుబడి వచ్చేటట్లు లేదు. కౌలు డబ్బులు ఎట్లా కట్టాల్నో తెలుస్తలేదు.

**- రమావత్ చాందీరాం, రైతు, ఒంటర్‌పల్లి, లింగంపేట మండలం**

# గొంతు నొక్కడమే ఇందిరమ్మ రాజ్యమా?

## జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం : జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, మార్చి 13 : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం అప్రజాస్వామికమని, కాంగ్రెస్ ప్రభుత్వ అధికార అహంకారానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ దుర్నీతిపై బయట ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైళ్లపాలు చేస్తున్నారని, అసెంబ్లీలో నిలదీస్తే సభ నుంచి గెంటేస్తున్నారన్నారు. జగదీశ్‌రెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు, ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రధాన ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా ప్రజల పక్షాన పోరాడేవారి గొంతు నొక్కడమే ఇందిరమ్మ రాజ్యమా? అని జీవన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కింది బీఆర్‌ఎస్ సభ్యుల గొంతు కాదని, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతు అని ఆయన మండిపడ్డారు. అప్రజాస్వామిక చర్యలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో పోరాడుతామన్నారు.

### నేడు జిల్లా వ్యాప్తంగా నిరసనలు..

జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# పీచేముడ్

- వర్సిటీ పేరు మార్పుపై సర్కారు వెనక్కి..
- సర్వత్రా ఆగ్రహం వెల్లువెత్తడంతో..
- నివేదిక అవసరం లేదన్న ఉన్నత విద్యామండలి

డిచ్‌పల్లి, మార్చి 13: త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్పు ప్రతిపాదనలపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకింది. సర్కారు తీరుపై విమర్శల సునామీ వెల్లువెత్తింది. ఇప్పటికే విద్యార్థి సంఘాలు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. అదే సమయంలో తెలంగాణ అస్తిత్వానికి ముప్పుగా పరిణమించిన సర్కారు చర్యలపై 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం కదలిక తెప్పించింది. పరిస్థితి చేయిదాటుతుండడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పేరు మార్పు అంశాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టేసింది.

### భగ్గుమన్న విద్యార్థి సంఘాలు..

తెలంగాణ విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ నేత మాజీ మంత్రి గీతారెడ్డి తల్లి ఈశ్వరీబాయి పేరును పెట్టేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రయత్నించడంతో వివాదం మొదలైంది. వర్సిటీ పేరు మార్పుపై నివేదిక ఇవ్వాలని విద్యామండలి నుంచి ఆదేశాలు రావడంతో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నివేదిక రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఈ విషయం కాస్త బయటకు పొక్కడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఇటు విద్యార్థి సంఘాలతో పాటు అటు ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. ఎన్నో పోరాటాల ద్వారా 2007 సెప్టెంబర్ 11న తెలంగాణ ప్రాంతం పేరిట ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ పేరును.. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారిస్తే మరోసారి ఉద్యమాలు తప్పవని హెచ్చరించాయి. ఇప్పటికే వర్సిటీలో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

### ప్రజాగ్రహంతో వెనక్కి..

పేరు మార్పు ప్రతిపాదనలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుండడంతో ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వంపై మరింత వ్యతిరేకత వస్తుందని తెలిపారు. దీంతో టీయూ పేరు మార్పు విషయంలో ఎలాంటి కార్యాచరణ చేపట్టవద్దని సీఎం ఆదేశించారు. దీంతో పేరు మార్పుపై ఎలాంటి నివేదికా అవసరం లేదని ఉన్నత విద్యామండలి నుంచి విశ్వవిద్యాలయానికి సమాచారమందింది. ఈ విషయాన్ని వర్సిటీ ఉన్నతాధికారులు కూడా ధ్రువీకరించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ విశ్వవిద్యాలయం పేరు మార్పుపై ఇంకెప్పుడైనా ఇలాంటి చర్యలకు దిగితే తీవ్ర వ్యతిరేక తప్పదని విద్యార్థి, ప్రజా సంఘాలు హెచ్చరించాయి.



### మనోభావాలు దెబ్బ తీయొద్దు..



విద్యార్థుల త్యాగాల మీద తెలంగాణ విశ్వవిద్యాలయం పునాది వేసుకున్నది. వర్సిటీ కోసం ఎంతో మంది విద్యార్థులు లాఠీదెబ్బలు తిన్నారు. తెలంగాణ అంటేనే రాష్ట్ర ఆత్మగౌరవం. అలాంటిది రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీ పేరు మార్చుతామనడం దురదృష్టకరం. పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచే ఇలాంటి చర్యలు మంచివి కావు.

**- డాక్టర్ సిద్దలక్ష్మి, టీయూ పూర్వ విద్యార్థి**


నగర శివారులోని సారంగపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేస్తున్న భారత జాగృతి నాయకులు

# శుభాకాంక్షల వెల్లువ





**భారత జాగృతి** వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ ఎన్నారై గ్లోబల్ కో-ఆర్డినేటర్ బిగాల మహేశ్‌గుప్తా, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్‌రాజు తదితరులు హైదరాబాద్‌లో కవితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పిడిగుద్దులాటపై పోలీసు ఆంక్షలు


హున్సా గ్రామంలో పిడిగుద్దులాట (ఫైల్)

- ఆడవద్దంటూ గ్రామ, కుల పెద్దలకు నోటీసులు
- వందేండ్ల ఆచారంపై వేటుకు రాష్ట్ర సర్కారు యత్నం
- మండిపడుతున్న హున్సా గ్రామస్తులు
- వినే ప్రసక్తే లేదంటున్న యువకులు

బోధన్, మార్చి 13: సాలూరా మండలంలోని హున్సా గ్రామంలో వందేండ్లకు పైగా ఆనవాయితీగా జరుపుకొంటున్న పిడిగుద్దులాటపై పోలీసులు ఆంక్షలు విధించారు. గ్రామస్తులు ఎంతో పవిత్రంగా భావించే ఈ సాంప్రదాయంపై రాష్ట్ర సర్కార్ 'పిడుగు' పడింది. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా సాయంత్రం జరగాల్సిన ఈ ఆటను ఆడనివ్వబోమని ప్రభుత్వం హుకూం జారీచేసింది. దీంతో 'పిడిగుద్దులాట' నిర్వహించకూడదంటూ పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ ఆటఆడడం చట్టవిరుద్ధమని, గ్రామంలో హోలీ రోజున 144 సెక్షన్ ఉంటుందంటూ పోలీసులు గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. శుక్రవారం జరిగే 'పిడిగుద్దులాట' నిర్వహిస్తే.. చట్టపరమైన చర్యలు ఉంటాయంటూ గ్రామంలోని 15 మంది గ్రామపెద్దలు, కులపెద్దలకు పోలీసులు నోటీసులు జారీచేశారు. పోలీసుల చర్యతో గ్రామస్తులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. వందేండ్లకుపైగా తమ గ్రామంలో పిడిగుద్దులాట జరుగుతున్నదని, ఎన్నడూ లేనివిధంగా ఆంక్షలు ఏంటని ప్రభుత్వ చర్యపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ సాంప్రదాయంపై వేటు వేయడానికి మీరెవరంటూ యువకులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఆడి తీరాల్సిందేనంటూ గ్రామస్తులు పట్టుబడుతున్నారు. గతంలో తమ ఆటపై ఇటువంటి ఆంక్షలు ఉండేవికావని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలంటూ పోలీసులు చెప్పేవారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు మాత్రం తాము ఏదో ఘోరానికి పాల్పడుతున్నామా అన్నట్లు ప్రవర్తించడం సరికాదంటున్నారు. అయితే పిడిగుద్దులాటను చూసేందుకు ఆ ఊరి ఆడబిడ్డలు, అల్లుళ్లు, బంధువులు ఇప్పటికే గ్రామానికి చేరుకున్నారు. ఒకపక్క పోలీసుల ఆంక్షలు, మరోపక్క గ్రామస్తుల మొండిపట్టు మధ్య శుక్రవారం జరిగే పరిణామాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

### పోలీసులు ఆంక్షలు పెట్టడం శోచనీయం



వందేండ్లకు పైనుంచే మా గ్రామంలో పిడిగుద్దులాట ఉన్నది. మా ఊరి ప్రత్యేకతగా ఈ ఆట గురించి గొప్పగా చెప్పుకుంటాం.. ఎప్పుడూ లేనివిధంగా ఈసారి ఆట ఆడవద్దంటూ పోలీసులు మా గ్రామ పెద్దలకు నోటీసులు ఇవ్వడం శోచనీయం. ఈ ఆట వల్ల ఇప్పటివరకూ ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదు. ఆట కారణంగా ఎటువంటి గొడవలు జరగలేదు. పిడిగుద్దులాట విషయంపై గ్రామస్తులందరం ఒకే మాటగా ఉంటాం. పోలీసులు హోలీ రోజున ఈ ఆటను అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని మనవి.

**- జక్క నాగరాజు, హున్సా**

### పిడిగుద్దులాట ఆడకపోతే ఊరికి అరిష్టం



పిడిగుద్దులాటను మా గ్రామంలో ఎంతో పవిత్రంగా భావిస్తాం. తాత, ముత్తాతల నుంచి ఈ ఆటను ఆడుతున్నారు. ఇప్పుడు సడెన్‌గా ఈ ఆట ఆడవద్దంటే ఆడకుండా ఉండలేం. ఒకవేళ ఆట ఆడకపోతే ఊరికి అరిష్టం జరుగుతుందన్న నమ్మకం ఉంది. మా ఆచారం, సాంప్రదాయాన్ని పోలీసులు అర్థంచేసుకోవాలి.

**- ఆనంద్‌రావు, హున్సా**

# మహాజన సభలో రైతుల నిరసన

- రుణమాఫీ ఎందుకు కాలేదని పాలకవర్గంపై ప్రశ్నల వర్షం
- సొసైటీలతో నష్టమే తప్ప లాభం లేదని ఆగ్రహం


మాల్తుమ్మెద సింగిల్ విండో పాలకవర్గ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట, మార్చి 13: మండల కేంద్రంలోని రైతువేదికలో మాల్తుమ్మెద సింగిల్‌విండో అధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహాజన సభ రైతుల నిరసనల మధ్య కొనసాగింది. రైతు రుణమాఫీతోపాటు పలు సమస్యలపై రైతులు పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సొసైటీ అధ్యక్షుడు దుందిగళ్ల నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఈవో సందీప్ 2024-25 మార్చి వరకు సొసైటీ ద్వారా జరిగిన లావాదేవీలను చదువుతుండగా సభ్యులు అడ్డుకున్నారు. రైతుల ఇబ్బందులను విండో పాలకవర్గం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు 108 మంది రైతులకు (రూ.45 లక్షలు) రుణమాఫీ కాలేదని, దీనిపై ఎవరూ స్పందించడంలేదన్నారు. ఎవరి తప్పో కానీ, రైతులకు మాత్రం నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో సైతం తరుగుతో పాటు డ్రైవర్ కోసం బస్తాకు ఒక రూపాయి చొప్పున వసూలు చేశారన్నారు. కాంటా చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్‌కు పంపే క్రమంలో దారి మధ్యలో పడిపోతే.. ఆ నష్టాన్ని రైతులపై వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సొసైటీల తీరుతో రైతులకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ధర్మ కాంటా ఏర్పాటు చేయాలని గతేడాది తీర్మానిస్తే ఇప్పటివరకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జమా, ఖర్చులు సమానంగా చేసి ఉన్నాయని, ఖర్చులకు సంబంధించిన వివరాలను ఇవ్వాలన్నారు. గతేడాది ఎరువుల స్టాక్ ఎంత ఉంది, ఈ ఏడాది స్టాక్ ఉన్న వివరాలను తెలపాలని రైతులు కోరారు. సీఈవో వద్ద వివరాలు లేకపోవడంతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. మాల్తుమ్మెద గేట్ వద్ద సొసైటీ కొనుగోలు చేసిన స్థలం వివరాలు, సొసైటీ పేరున ఉన్న పత్రాలు చూపాలని రైతులు కోరారు. సరైన ఆధారాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


కామారెడ్డి జిల్లాకేంద్రంలో కామదహనం నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు

ఉమ్మడి జిల్లాలో గురువారం రాత్రి కామ దహనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ఆర్యసమాజం ఆధ్వర్యంలో కామదహనం, ఆర్య యజ్ఞ కార్యక్రమాలు వేదపండితుల నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఫాల్గుణ పౌర్ణమి ముందు చతుర్దశి నాడు కామ దహనం నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమని వేదపండితులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోనూ కామ దహన కార్యక్రమం నిర్వహించారు.

-కామారెడ్డి, మార్చి 13